పేద మున్నూరు కాపు విద్యార్థులకు చేయూత

కాచిగూడ, మార్చి 26: తండ్రి లేదా సంరక్షకుడిని కోల్పోయిన విద్యార్థుల ఉన్నత చదువుల కోసం చేయూతను అందిస్తున్నట్లు మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ వెంకట్‌రావు అన్నారు. ట్రస్ట్‌బోర్డు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అర్హులైన విద్యార్థులు అర్జీ పత్రం, మరణ ధ్రువపత్రం, ప్రస్తుత విద్యా సంవత్సరం 2023-24 స్టడీ సర్టిఫికేట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ అకౌంట్ వివరాలతో కాచిగూడలోని విద్యార్థి ట్రస్ట్‌బోర్డు కార్యాలయంలో ఏప్రిల్ 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీలు పన్నాల విష్ణువర్ధన్, పిల్లి శ్రీనివాస రావు, ఆకుల నగేశ్, వై.దేవేందర్, ఏ.చంద్రశేఖర్ పాల్గొన్నారు. వివరాలకు mkvvgtrust@gmail.com. web: www.mkvvgtrust.org లేదా 040-24658160, 24657404, 9491627404లో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి జాతీయ స్థాయి షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 26: ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం బుధవారం నుంచి జాతీయ స్థాయి షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నది. 'జామ్స్-ఏ-సైన్మా'గా వ్యవహరించే ఈ ఫెస్టివల్‌ను తెలంగాణ ప్రభుత్వ భాషా, సాంస్కృతిక విభాగం సహకారంతో నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే ఈ ఫెస్టివల్‌లో దేశ వ్యాప్తంగా షార్ట్ ఫిల్మ్స్ రూపొందించే విద్యార్థులకు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం దక్కనుంది. ఈ ఫెస్టివల్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, భాష, సాంస్కృతిక విభాగం డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి తదితరులతో పాటు సినీ పరిశ్రమ నుంచి దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక సిబ్బంది హాజరవనున్నారు. ఈ రెండు రోజుల భారీ ఈవెంట్‌లో భాగంగా పోటీలు, వర్క్‌షాప్, ప్యానల్ డిస్కషన్స్ వంటివి నిర్వహిస్తామని నిర్వహకులు పేర్కొన్నారు.

రోగ నిర్ధారణలో ల్యాబ్ టెక్నిషియన్ల పాత్ర కీలకం

హైదరాబాద్, మార్చి 26(నమస్తే తెలంగాణ): రోగ నిర్ధారణలో ల్యాబ్ టెక్నిషియన్ల పాత్ర కీలకమని డీఎంఈలు వాణి, శివరామకృష్ణ కొనియాడారు. ప్రభుత్వ మెడికల్ ల్యాబ్ టెక్నిషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని సోమవారం వారు నగరంలో ఆవిష్కరించారు. ల్యాబ్ టెక్నిషియన్లపై తీవ్ర పని భారమున్నా చాలా సమర్ధంగా సేవలను అందిసున్నారని చెప్పారు. అనేక ఖాళీలున్నా పదోన్నతులను పెండింగ్‌లో ఉంచారని, కోడ్ ముగిసిన వెంటనే పదోన్నతులు పూర్తి చేయాలని ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు డీఎంఈలను కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేశ్, ఉపాధ్యక్షులు పురుషోత్తం, ప్రవీణ్, బసప్ప, కార్యవర్గ సభ్యులు భాస్కర్, కౌసరున్నీసా, ముజీబ్, శ్రీనివాస్, నరసయ్య, రత్నమాల, కవిత, విజయ భాస్కర్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

గ్రూప్ 1 ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

సిటీబ్యూరో, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : గ్రూప్-1 పరీక్ష ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగించామని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్ ఇలియాస్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోచింగ్ 45 రోజులు ఇవ్వబడుతుందని, ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు నాంపల్లిలోని హజ్ హౌస్ 6వ అంతస్తులోని మైనార్టీ కార్యాలయం లేదా గన్‌ఫౌండ్రిలోని తెలంగాణ స్టేట్ మైనారిటీ స్టడీ సర్కిల్‌లో ఈనెల 31 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కష్టజీవులపై బుల్డోజర్లు..!!

వీధి వ్యాపారులపై.. విరుచుకుపడిన జీహెచ్ఎంసీ

- షాపూర్‌నగర్ కూరగాయల మార్కెట్‌లో విధ్వంసం
- గుర్తింపు కార్డులతో జీవనోపాధి పొందుతున్న 400 కుటుంబాలపై కక్ష సాధింపు
- ఉన్నతాధికారి ఆదేశించింది ఒకటైతే.. ప్రతాపం చిరు వ్యాపారులపై
- అధికారుల తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం
- బాసటగా నిలిచిన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
- బాధ్యులైన అధికారులకు మెమోలతో సరిపెట్టిన డీసీ మల్లారెడ్డి
- కమిషనర్ రొనాల్డ్ రాస్ జోక్యం చేసుకోవాలని వినతి

అధికారుల దాడులతో ధ్వంసమైన తోపుడుబండ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్/జీడిమెట్ల, మార్చి 26 :

వీధి వ్యాపారులపై జీహెచ్ఎంసీ విరుచుకుపడింది. రెక్కాడితే గానీ డొక్కాడనీ చిరు వ్యాపారుల బతుకులను ఆగం చేసింది. దాదాపు 400 కుటుంబాలను రోడ్డున పడేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజుల రామారం సర్కిల్, షాపూర్‌నగర్ కూరగాయల మార్కెట్‌పై మంగళవారం అధికారులు ప్రతాపం చూపారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా మున్సిపల్ అధికారులు, సిబ్బంది వ్యాపార సముదాయాలపై దాడులకు దిగారు. 2017లో గుర్తించి, ఐడీ కార్డులు అందజేసి వారి ఆర్థికాభివృద్ధికి భరోసా కల్పించిన జీహెచ్ఎంసీ అధికారులే వారి పట్ల కక్ష సాధింపుగా చర్యలు తీసుకోవడం పట్ల తీవ్ర స్థాయిలో విమర్శలు వెళ్లువెత్తాయి. ఇక్కడ విక్రయాలు కొనసాగిస్తున్న ప్రాంతం గ్రీన్ జోన్‌లో ఉన్నదని, ట్రాఫిక్‌కు సంబంధించి ఎటువంటి సమస్యలేదని గుర్తించి లైసెన్సులు ఇచ్చారని సంబంధిత వ్యాపారులు పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తమ దుకాణాలపై విచక్షణారహితంగా దాడులు నిర్వహించి, తోపుడు బండ్లను విరగ్గొట్టి నానా హంగామా చేశారని తీవ్రంగా మండిపడ్డారు. ప్రధాన రహదారిని ఆక్రమించి వ్యాపారాలు చేసే వారిని కాదని మాపై చర్యలు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. మొత్తంగా ఉన్నతాధికారి ఒకటి ఆదేశిస్తే.. కిందిస్థాయి అధికారులు అత్యుత్సాహంతో, తమకు ఈ వీధి వ్యాపారుల నుంచి ఆదాయం రావడం లేదనో, లేక మరో రకమైన భావజాలంతోనో వీధి వ్యాపారుల జీవితాలను చిందర వందర చేశారు.

చెప్పిందేమిటీ..? చేసిందేమిటీ..?

రోడ్డును ఆక్రమించి వెలసిన దుకాణ సముదాయాలను తొలగించాలని ఉన్నతాధికారులు సూచించగా అత్యుత్సాహం ప్రదర్శించిన టౌన్ ప్లానింగ్, శానిటేషన్ అధికారులు ఏకంగా జేసీబీలతో తోపుడు బండ్లు, డబ్బాలను కూల్చివేయడం వివాదాస్పదంగా మారింది. అధికారుల చర్యలతో ఆగ్రహించిన చిరు వ్యాపారులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై ధర్నాకు దిగారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికారులు ధ్వంసం చేసిన తోపుడు బండ్లు, డబ్బాలను తిరిగి ఏర్పాటు చేసేంత వరకు ఆందోళనను విరమించేది లేదని స్పష్టం చేశారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. విషయం తెలుసుకున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ బాధితులకు అండగా నిలిచారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. షాపూర్‌నగర్ మార్కెట్‌లో బాధితులను కలిసి పరామర్శించారు. సమస్య ఎలాచోటుచేసుకుందో వారితో చర్చించి తెలుసుకున్నారు. అనంతరం గాజుల రామారం ఉప కమిషనర్ మల్లారెడ్డిని కలిసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ముందస్తు సమాచారం లేకుండా వారి దుకాణాలను ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించారు. అత్యుత్సాహం ప్రదర్శించిన అధికారులపై వెంటనే తగిన చర్యలు తీసుకొని విధుల్లోంచి తొలగించాలని ఎమ్మెల్యే వివేకానంద్ డిమాండ్ చేశారు. ఒకవేళ మార్కెట్ తీసేయాలి అనుకున్నప్పుడు ముందస్తు సమాచారం ఇవ్వాలి లేదా ప్రభుత్వ పాలసీ ప్రకారం చర్యలు తీసుకోవాలి కానీ.. ఇలా ఉన్నట్టుండి వారి జీవనోపాధిపై దెబ్బ కొట్టడం సరైన పద్ధతి కాదని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

టీపీ, శానిటేషన్ శాఖలకు మెమోలు

కాగా ఈ విషయంలో అత్యుత్సాహం చూపిన టౌన్ ప్లానింగ్ అధికారి సంగీత, శానిటేషన్ జవాన్ చందర్‌కు మెమోలు జారీ చేసినట్లు గాజులరామారం ఉప కమిషనర్ మల్లారెడ్డి తెలిపారు. వాస్తవానికి తాము ప్రధాన రహదారిలోని ఆక్రమణలు తొలగించాలని సూచిస్తే, అందుకు విరుద్ధంగా జేసీబీలతో కూరగాయాల మార్కెట్ రోడ్డులోని డబ్బాలు, తోపుడు బండ్లను తొలగించడం పట్ల ఆయన విస్మయం వ్యక్తం చేశారు.

ముందస్తు సమాచారం ఇవ్వలేదు

నోటీసులు ఇవ్వకుండానే తమ షెడ్లను జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేయడం ఎంతవరకు సమంజసం. 30 ఏండ్ల నుంచి ఇక్కడ వ్యాపారాలు చేస్తున్నాం. ఏ అధికారి కూడా తమను ఇబ్బందులకు గురి చేయలేదు.

– షేక్ ఇస్మాయిల్, చిరు వ్యాపారి, షాపూర్‌నగర్

రూ.50 వేల ఆస్తి నష్టం జరిగింది

40 సంవత్సరాలుగా ఇక్కడ వ్యాపారాలు చేసుకుంటున్నాం. మొన్ననే రూ.50 వేల విలువ చేసే మట్టి పాత్రలు తీసుకొచ్చాను. ముందస్తు సమాచారం లేకుండా తన షెడ్డును కూల్చివేయడంతో సగానికి పైగా మట్టికుండలు ధ్వంసమయ్యాయి.

నార్సింగిలో ఆనంద్ మాల్ ప్రారంభం

సిటీబ్యూరో, మార్చి 26(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని నార్సింగి ప్రాంతంలో ఆనంద్ మాల్ అండ్ మూవీస్ అందుబాటులోకి వచ్చింది. రఘురామ్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్మించిన కమర్షియల్ మాల్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నార్సింగి వాసులకు షాపింగ్ కాంప్లెక్స్, మల్టీప్లెక్స్‌తో వినోదాన్ని పంచడమే లక్ష్యంగా, అందుబాటులో డీ మార్ట్ షాపింగ్ స్టోర్ కూడా ఏర్పాటు చేశామన్నారు. షాపింగ్, ఎంటర్‌టైన్‌మెంట్, మూవీస్, ఫుడ్ కోర్టులతో వినూత్న అనుభూతిని పొందేలా ఆనంద్ మాల్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

హెచ్ఎండీఏ భూములపై మళ్లీ వివాదం

శంషాబాద్ భూముల పరిరక్షణలో అధికారులు విఫలం

సిటీబ్యూరో, మార్చి 26(నమస్తే తెలంగాణ): ఈ విశ్వంలో సెంట్ భూమి ఎంతో విలువైనది. అందులో హైదరాబాద్ మహానగరాన్ని ఆవరించి ఉన్న భూములకు విపరీతమైన డిమాండ్ ఉన్నది. భూముల ధరలు ఆకాశాన్నంటుతుండటంతో కొనలేని పరిస్థితి నెలకొన్నది. ఈ నేపథ్యంలో భూకబ్జాదారులు విపరీత బుద్ధులకు పోయి, భూ సొంతదారు స్థలంపై నకలు ధ్రువ పత్రాలు సృష్టించి వివాదాలకు ఊతమిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే శంషాబాద్‌లోని హెచ్ఎండీఏ భూములపై మళ్లీ వివాదం మొదలైంది. శంషాబాద్‌లో హెచ్ఎండీఏకు చెందిన 50 ఎకరాలను కబ్జా చేసేందుకు భూ కబ్జాదారులు తప్పుడు పత్రాలు సృష్టిస్తే, వాటిని తెలంగాణ హైకోర్టుతో పాటు సుప్రీం కోర్టుల్లో గత కేసీఆర్ ప్రభుత్వం తరపున న్యాయవాదులు బలమైన వాదనలు వినిపించడంతో ఆ భూములు హెచ్ఎండీకే చెందుతాయని కోర్టులు తీర్పు వెల్లడించాయి. తాజాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ పరిరక్షణ విషయంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఇదే అదునుగా తీసుకున్న భూకబ్జాదారులు అదే భూములపై కన్నేసి మరోసారి తమ సొంతం చేసుకునే ప్రయత్నాలు మొదలు పెట్టారు. అందులో భాగంగానే మళ్లీ కింది స్థాయిలోని కోర్టులో ఫిటిషన్ దాఖలు చేసి శంషాబాద్‌లోని స్థలం వద్ద బెదిరింపులకు పాల్పడుతున్నాడు. న్యాయస్థానాల్లో ఫిటిషన్లు దాఖలు చేయడం సైట్ వద్దకు వచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నా, హెచ్ఎండీఏ అధికారులు మాత్రం క్షేత్ర స్థాయిలో గట్టిగా చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న భూముల పరిరక్షణ కోసం స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ర్యాంకు కలిగిన రెవెన్యూ అధికారితో పాటు డీఎస్పీ ర్యాంకు కలిగిన పోలీసు అధికారుల వ్యవస్థ అందుబాటులో ఉన్నా, భూముల పరిరక్షణ విషయంలో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ పరంగా ఎలా అన్ని అందుబాటులో ఉన్నా, క్షేత్ర స్థాయిలో జరిగే విషయాల పట్ల అధికారులు సత్వరమే స్పందించకుండా నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తుండటం వల్లే భూకబ్జాదారులు హెచ్ఎండీఏ భూములను ఏదో ఒక రూపంలో కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అందుకు తాజా నిదర్శనమే.. శంషాబాద్ భూములు అని చెప్పవచ్చు. సుప్రీం కోర్టు తీర్పు వచ్చిన తర్వాత సైతం మళ్లీ భూకబ్జాదారులు వివాదాస్పదం చేయడంలో హెచ్ఎండీఏ పనితీరే ప్రధాన కారణమని ఆరోపిస్తున్నారు.

గత ప్రభుత్వంతోనే వెలుగులోకి..

శంషాబాద్‌లో అత్యంత విలువైన హెచ్ఎండీఏ భూములను కబ్జా చేసేందుకు ఉమ్మడి రాష్ట్రంలో కొందరు ప్రయత్నించారు. ఒకటి కాదు, రెండు కాదు... ఏకంగా 50 ఎకరాలు! వాటి విలువ ఒకేసారి రూ.1,000 కోట్లకు వరకు ఉంటుంది. అలాంటి భూములకు బోగస్ కోర్టు ఉత్తర్వులతో ఎసరు పెట్టేందుకు ఇద్దరు వ్యక్తులు పన్నిన పన్నాగాన్ని గత కేసీఆర్ ప్రభుత్వం అడ్డుకోవడంతో పాటు హైకోర్టులో పక్కా ఆధారాలతో వాదించింది. దీంతో గతేడాది డిసెంబర్ 14న రాష్ట్ర హైకోర్టు శంషాబాద్‌లోని 50 ఎకరాల భూములు హెచ్ఎండీఏవే తుది తీర్పును వెలువరించింది.

హైకోర్టు శంకుస్థాపన.. ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, మార్చి 26(నమస్తే తెలంగాణ): హైకోర్టు నిర్మాణానికి శంకుస్థాపన సందర్భంగా రాజేంద్రనగర్ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ సైబరాబాద్ జాయింట్ కమిషనర్ (ట్రాఫిక్) ఆదేశాలు జారీ చేశారు. శంషాబాద్, మెహిదీపట్నం నుంచి వచ్చే వాహనాలను చాంద్రాయణగుట్ట రోడ్డు వైపు అనుమతించరు. ఈ వాహనాలను జూ పార్క్, బహదూర్‌పురా మీదుగా అనుమతిస్తారు. కాటేదాన్ నుంచి వచ్చే వాహనాలను చాంద్రాయణగుట్ట వైపు అనుమతించకుండా ఆరాంఘర్, బహదూర్‌పురా మీదుగా అనుమతిస్తారు.

మంగళవారం మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ది సీ కనెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్నోవేటివ్ అవార్డ్స్ - 2024 కార్యక్రమంలో పాల్గొని పలు రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు అందజేస్తున్న ఐటీ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్

– మాదాపూర్, మార్చ్ 26

ఎన్నికల విధుల్లోని ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్

నిజాం కాలేజీలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, మార్చి 26(నమస్తే తెలంగాణ): రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్, హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగుల కోసం నిజాం కాలేజీ మైదానంలో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్, హైదరాబాద్ రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మే 7, 8, 9, 10వ తేదీల్లో ఈ పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ మేరకు బషీర్‌బాగ్‌లోని నిజాం కళాశాల మైదానాన్ని సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి పాటిల్ హేమంత్ కేశవ్‌తో పాటు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ పేపర్లను ఇచ్చేందుకు నిజాం కాలేజీ మైదానంలో పోస్టల్ బ్యాలెట్లను మే 7 నుంచి 10వ తేదీ వరకు, మే 11, 12వ తేదీల్లో రిసెప్షన్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. హైదరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ, సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లు, కంటోన్మెంట్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర పార్లమెంటు నియోజకవార్గలకు చెందిన ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కోసం 30 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి, అడిషనల్ కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, ఆర్డీవో కే మహిపాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నాంపల్లి తాసిల్దార్, కలెక్టర్ పర్యవేక్షకులు రాములు, పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులకు ఐఐసీటీలో శిక్షణ

స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా పరిశోధకులచే అవగాహన

సిటీబ్యూరో, మార్చి 26(నమస్తే తెలంగాణ): సీఎస్ఐఆర్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఈశాన్య, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని విద్యా సంస్థలకు చెందిన యువ పరిశోధకులు, విద్యార్థులకు ప్రత్యేక శిక్షణనిచ్చారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 10 రోజుల ఓరియెంటేషన్ కార్యక్రమాల్లో పరిశోధన విధానాలు, అందుబాటులో ఉన్న ఆర్థిక ప్రోత్సాహాలతో పాటు, పరిశోధన సౌకర్యాలపై అవగాహన కల్పించినట్లుగా ఐఐసీటీ వర్గాలు పేర్కొన్నాయి. చివరి రోజున విద్యార్థులతో ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి సమావేశం కాగా, శాస్త్ర, సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులు, అందివస్తున్న అవకాశాలపై చర్చించారు. పరిశ్రమలకు అనుగుణంగా విద్యార్థులకు శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు.

పెంచిన టెట్ దరఖాస్తు ఫీజులను వెంటనే తగ్గించాలి

హిమాయత్‌నగర్, మార్చి 26: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ఫీజును తగ్గించిన తరువాతనే దరఖాస్తులను స్వీకరించాలని రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్ ఎం.రాధారెడ్డిని మంగళవారం ఏఐవైఎఫ్ ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర మాట్లాడుతూ టెట్ పరీక్ష ఫీజు పెంపు వల్ల పేద, మధ్య తరగతి అభ్యర్థులకు ఆర్థికంగా అధిక భారం పడుతుందన్నారు. గత ప్రభుత్వంలో టెట్ ఒకటో పేపర్‌కు ఫీజు రూ.200, రెండో పేపర్‌కు రూ.300 ఉండేదని, ఇప్పుడు ఒక పేపర్‌కు రూ.1000, రెండు పేపర్లకు రూ.2000 పెంచడం సరికాదన్నారు. 33 జిల్లాలోనూ టెట్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్, శ్రీమాన్‌లు పాల్గొన్నారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 26: ఓయూలో వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ పరీక్షల విభాగం కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్ - ఈవినింగ్) మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 30వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో వచ్చే నెల 6వ తేదీలోగా చెల్లించవచ్చన్నారు. బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (హెచ్ఐ) నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును వచ్చే నెల 6వ తేదీలోగా, రూ.300 అపరాధ రుసుముతో 8వ తేదీలోగా చెల్లించాలన్నారు. ఎంఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును వచ్చే నెల 20వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించవచ్చన్నారు. రూ.200 అపరాధ రుసుముతో 22వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

ఫలితాలు విడుదల..

ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. బీ ఫార్మసీ (సీబీసీఎస్), బీ ఫార్మసీ (నాన్ సీబీసీఎస్) కోర్సులతో పాటు దూర విద్యా విధానంలో అందించే డేటా సైన్స్ కోర్సు మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

ఎం.ఈ, ఎం.టెక్ ఫలితాల రివాల్యుయేషన్

ఓయూ పరిధిలోని అన్ని విభాగాల ఎం.ఈ, ఎం.టెక్ కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి, ఈ నెల 30వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.200 అపరాధ రుసుముతో వచ్చే నెల 2వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 2వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

డీడీఎంఎస్ కోఫేమ్‌లో మీడియా కోర్సులకు దరఖాస్తులు

ఓయూ క్యాంపస్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ మీడియా ఎడ్యుకేషన్ (డీడీఎంఎస్ కోఫేమ్)లో వివిధ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల చైర్‌పర్సన్ డాక్టర్ రమాప్రభ తెలిపారు. కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ న్యూస్ రీడింగ్, వాయిస్ ఓవర్, డబ్బింగ్, యాక్టింగ్ తదితర అంశాల్లో సర్టిఫికెట్ కోర్సులను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కోర్సుల తరగతులను వచ్చే నెల 5వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆరు వారాల ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే నెల 1వ తారీఖు ఆఖరన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఫోన్ నం: 94417 68811, 94413 86157 లలో సంప్రదించాలన్నారు.

ఇంజినీరింగ్ కళాశాలలో ఓపెన్ లెర్నింగ్ స్పేస్

ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) విభాగంలో త్వరలో ఓపెన్ లెర్నింగ్ స్పేస్ ప్రారంభం కానుంది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న మోస్ చిప్ టెక్నాలజీస్ లిమిటెడ్ అందించే కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల ద్వారా ఓపెన్ లెర్నింగ్ స్పేస్‌గా మార్చనున్నట్లు విభాగం హెడ్ ప్రొఫెసర్ రామకృష్ణ తెలిపారు. మోస్ చిప్ టెక్నాలజీస్ లిమిటెడ్ సీఈవో, సీఎండీ, తమ విభాగం పూర్వ విద్యార్థి శ్రీనివాసరావుకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు.

కాంగ్రెస్ అంటేనే.. కులం, వారసత్వం

- కాంగ్రెస్‌లో వారసత్వానికే మొగ్గు
- సబ్బండ వర్గాల ఓట్లతో గెలిచి వారికే ద్రోహం చేస్తారా?
- లోక్‌సభకు బీఆర్ఎస్ 40 శాతం టికెట్లు కేటాయించింది
- పార్లమెంట్ ఎన్నికల్లో మా తడాఖా చూపిస్తాం
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్, చిత్రంలో తదితరులు

ఖైరతాబాద్, మార్చి 26: ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కుటుంబం, కులం, వారసత్వ పాలన కొనసాగిస్తున్నదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం సీఎం రేవంత్ రెడ్డి సామాజికవర్గ ఓట్లతో అధికారంలోకి రాలేదని, 90 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ఓట్లు వేస్తేనే వచ్చిందనే విషయాన్ని మర్చిపోయారన్నారు. తెలంగాణ ప్రజలు